RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 305 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 8 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# పట్టు కోసం..!

## క్యూ కడుతున్న జాతీయ పార్టీలు..

హైదరాబాద్ : టార్గెట్ తెలంగాణ.. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్.. మధ్యలో బీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ను కాసేపు పక్కన పెడదాం. ఇప్పుడు జాతీయ పార్టీల మెయిన్ టార్గెట్ తెలంగాణ. ఇక్కడ ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో గెలుపు కోసం కిందా మీదా పడుతున్నాయి. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా వారం రోజులే ఉండటంతో మరింత స్పీడ్‌ను పెంచాయి. మరి ఇప్పటి వరకు ఉన్న జరిగిందేంటి? దాని వల్ల లాభం పొందింది ఎవరు? ఇకపై జరగబోయేదేంటి? తెలంగాణ.. మే 13న జరిగే ఎన్నికల్లో 17 లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రం. పదిహేడే కదా అని సింపుల్‌గా తీసేసే పరిస్థితి లేదు. ప్రస్తుత ఎన్నికల పరిణామాలు చూస్తుంటే.. ప్రతి సీటు ఇంపార్టెంటే.. అందుకే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ.. ప్రతి సీటును గెలుచుకునేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. అందుకే ఎన్నికలకు ఇంకా వారం రోజులున్న విషయాన్ని గుర్తించి.. జోరు పెంచాయి.

సభలు, సమావేశాలు, రోడ్ షోలతో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే చలో తెలంగాణ అని పిలుపునిస్తున్నారు జాతీయ పార్టీ నేతలు.. ఇప్పటికే రాహుల్, ప్రియాంకగాంధీ తెలంగాణలో విచ్చేశారు. బీజేపీ నుంచి ప్రధాని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా తెలంగాణ చుట్టే చక్కర్లు కొడుతున్నారు.. మోడీ 8న వేములవాడ, వరంగల్ సభల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత 10న నారాయణపేట, హైదరాబాద్‌లో జరిగే సభలో కూడా పాల్గొంటారు. ఇప్పటికే జేపీ నడ్డా.. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్.. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ.. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై.. వీరంతా తెలంగాణ గడ్డపైనే ఉన్నారు.. ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇలా ఏదో ఒక దాంట్లో పాల్గొన్నారు.. పాల్గొంటున్నారు కూడా. నిజానికి బీజేపీ తెలంగాణలో 10 స్థానాలను దక్కించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే తెలంగాణ నేతలతో సమావేశమైన అమిత్ షా.. ఈ టార్గెట్ ఫిక్స్ చేశారు. అప్పటి నుంచి ప్రత్యేకమైన రూట్ మ్యాప్‌తో ముందుకు వెళుతున్నారు. బట్ గ్రౌండ్ రియాల్టీ మాత్రం అలా కనిపించడం లేదు. దీనికి కారణం కాంగ్రెస్ నేతలు ప్రచారంలో ఓ అడుగు ముందు ఉండటమే.. బీజేపీకి ఓ నైట్ మేర్‌లా మారింది సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రచారం. అటు రిజర్వేషన్ల విజయంలో బీజేపీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దు అంటూ చెలరేగిపోతున్నారు. ఎట్ ది సేమ్ టైమ్.. తెలంగాణకు బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు తప్ప మరోటి ఏం లేదని చెబుతున్నారు. మోడీ, అమిత్‌షా, నడ్డా స్పీచ్‌ల కంటే.. తెలంగాణ ప్రజలకు ఇది బాగా రీచ్ అవుతుంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా తెలంగాణలో చక్కర్లు కొడుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లిఖార్జున ఖర్గేతో పాటు.. ఇతర పార్టీ నేతలు కూడా తెలంగాణలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదిలాబాద్‌లో రాహుల్ ప్రచారం నిర్వహించగా.. ఎల్లారెడ్డిలో ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఓవరాల్‌గా సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ.. ప్రచారపు చివరి రోజైన 11వ తేదీ వరకు ప్రచారంలో బిజీ బిజీగా గడపనున్నారు. ఈ రెండు పార్టీల పరిస్థితి ఇలా ఉంటే.. బీఆర్ఎస్‌ది మరో బాధ అన్నట్టుగా కనిపిస్తుంది. ప్రస్తుతం సీట్ల సంగతి ఏమో కానీ.. ఓట్ బ్యాంక్‌ను కాపాడుకునే పనిలో బిజీగా ఉంది బీఆర్ఎస్.. ఈ ఎన్నికలు నిజానికి బీఆర్ఎస్ చాలా ప్రతిష్టాత్మకం.. కాంగ్రెస్, బీజేపీలకు ఇతర రాష్ట్రాలు ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ బేస్ మొత్తం తెలంగాణానే.. ఇక్కడ ఓడిందంటే.. పార్టీ కథ కంచికే.. అందుకే గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతుంది. ఇప్పటికే ఐదు నియోకవర్గాలను వదిలేసిన పార్టీ అధినేత కేసీఆర్.. మిగిలిన 12 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అటు కేటీఆర్, హరీష్‌రావు కూడా సైలెంట్‌గా ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. బట్ బీఆర్ఎస్ కేడర్‌లో కాస్త అసంతృప్తి ఉన్నట్టు కనిపిస్తుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్ పర్సంటేజ్.. 41.71 శాతం.. అదే కాంగ్రెస్‌కు 29.79 శాతం. ఇక బీజేపీకి వచ్చిన ఓటింగ్ పర్సంటేజ్ 19.65 శాతం. బట్ ఈసారి ఈ లెక్కలన్నీ తారుమారు కానున్నాయి. కావొద్దన్నది బీఆర్ఎస్ కోరిక.. కానీ అది నెరవేరే అవకాశం కనిపించడం లేదు. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులతో పాటు స్టార్ క్యాంపెయినర్లు ప్రచారంలో జోరు పెంచారు. ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇకపై మరో లెక్క.. అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికలకు కౌంట్‌డౌన్ కంటిన్యూ అవుతున్న కొద్ది.. ప్రచారపర్వం ఊపందుకుంటుంది. ఇప్పటి వరకు జరిగిందంతా పాస్ట్.. ఇకపై ఎవరు ప్రజల మనసులు గెలుచుకుంటే.. వారే కింగ్‌లు.




ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కోర్టుకు హాజరైన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. కోర్టు హాల్ నుంచి బయటకు వెళ్తూ.. ప్రజ్వల్ రేవన్నఅంశంపై స్పందించారు. మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ లాంటి వారిని విడిచిపెట్టి.. దేశం దాటించి.. తనలాంటి వాళ్లను అరెస్ట్ చేశారంటూ కేంద్ర ప్రభుత్వంపై కవిత ఫైర్ అయ్యారు.

ఇది అన్యాయమైన చర్య అని.. దీన్ని ప్రజలందరూ గమనించాలని అన్నారు కవిత. వాస్తవానికి లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవిత కస్టడీ నేటితో ముగిసింది. దీంతో తీహార్ జైలు అధికారులు ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం. కవితకు మే 14వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడగించింది. ఇదిలాఉంటే.. వారం రోజుల్లోగా కవితపై చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని ఈడీ అధికారులు కోర్టుకు తెలిపారు.




# రాష్ట్రంలో నిలిచిన బీర్ల ఉత్పత్తి..

## నీటి కొరతే కారణమా..!

హైదరాబాద్ : వేసవికాలం ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. మరోవైపు ఎన్నికల ప్రచారాలు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రచారాలు చేస్తూ సాయంత్రానికి చల్లటి బీరు తాగి తీరాలని ప్రతిఒక్కరు అనుకుంటారు. కానీ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మందుబాబులకు అలాంటి కిక్ దొరకడం లేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కూడా బీర్లు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో గత కొంతకాలంగా రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడింది . ఇక బీర్లు అందుబాటులో లేకపోవడంతో మందుబాబులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగానే వేసవికాలంలో బీర్ల అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయి . అయితే ఈ ఏడాది వేసవికాలంతోపాటు లోక్ సభ ఎన్నికలు మరియు ఐపీఎల్ సీజన్ కొనసాగుతున్నడంతో బీర్లకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రతి ఒక్కరు కూడా బీరు తాగుతూ వాటిని ఎంజాయ్ చేయాలనుకుంటున్నారు. అయితే ప్రస్తుతం బీర్ల అమ్మకాలకు విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ అధికారులు వాటిని అందించలేని పరిస్థితిలో ఉన్నట్లుగా చెబుతున్నారు. అంతేకాక ఈ ఏడాది మార్చి మరియు ఏప్రిల్ నెలలో బీర్ల అమ్మకాలు పెద్ద మొత్తంలో సాగాయి. ఇక ఇప్పుడు మే నెలలోఎండలు మరింత పెరగడంతో పెద్ద మొత్తంలో బీర్లు అమ్ముడు అవుతున్నాయి. కానీ వైన్స్ లో మాత్రం సరిపడా బీర్లు అందుబాటులో ఉండడం లేదు. దీంతో నిర్వాహకులు కూడా వైన్ షాప్స్ ముందు నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. ఇక స్టాక్ వచ్చిన రెండు గంటలోనే బీర్లని అమ్ముడు అవుతున్నాయని చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం బీర్లు చల్లగా లేకపోయినా పర్లేదు కానీ అందుబాటులో ఉంటే చాలు అంటూ మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో పెద్ద మొత్తంలో బీర్ల కొరత రాడానికి గల ముఖ్య కారణం నీటి కొరత అని తెలుస్తోంది.

బీర్ల తయారు చేసే కేంద్రాలలో నీటి కొరత ఉండడంతో బీర్లు ఉత్పత్తి చేయలేకపోతున్నట్లుగా తయారీ కేంద్రాలు తెలియజేస్తున్నాయి. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో రిజర్వాయర్లలో నీటి లభ్యత లేకపోవడంతో ఈ ప్రభావం బీర్ల తయారీ కేంద్రాలపై కూడా పడినట్లుగా అర్థమవుతుంది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఒకపక్క నీటి కొరత కొనసాగుతుంటే మరో పక్క బీర్ల కొరత కొనసాగుతుంది.



## కేసీఆర్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్..

హైదరాబాద్: రిజర్వేషన్లు ఎత్తివేయడం కోసం బీజేపీ ప్రయత్నం చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. నేడు ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నాలుగు వందల సీట్లు వస్తే రాజ్యంగాన్ని మార్చాలని బీజేపీ చూస్తోందన్నారు. 'సంపద పెంచుతాం.. పంచుతాం' ఇదే కాంగ్రెస్ నినాదమని తెలిపారు. కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇవ్వగానే బీజేపీ కుట్రలు మొదలు పెట్టిందని భట్టి విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టామన్నారు. దేశంలో అధికారంలోకి రాగానే మా ప్రభుత్వం కులగణన చేస్తుందని తెలిపారు. రిజర్వేషన్లు కాపాడుకునేందుకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ లు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యంగం ప్రమాదంలో ఉందన్నారు. దేశంలో భయానక పరిస్థితులు ఉన్నాయన్నారు. కేసీఆర్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు బీజేపీ చేస్తున్న అన్యాయానికి కేసీఆర్ మద్దతు ఇస్తున్నారన్నారు. కేసీఆర్, బీజేపీ ముసుగు తీసేసి మాట్లాడితే మంచిదన్నారు. మోదీ ప్రధాని అయిన నాటి నుంచే రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర మొదలైందన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు ఉంది కేసీఆర్ పరిస్థితి అని పేర్కొన్నారు. తెలంగాణలో మా పార్టీ 14 సీట్లు గెలుపు పక్కా అని పేర్కొన్నారు.




## దయచేసి పవిత్రమైన ఈ నేలపై విషం చిమ్మకండి..!

హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ఆయనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. మీరు రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో.. యావత్ తెలంగాణ సమాజం పక్షాన కొన్ని ప్రశ్నలు అడిగారు. మోదీని కేటీఆర్ ఏమేం ప్రశ్నలు అడిగారంటే.. "దయచేసి పవిత్రమైన ఈ నేలపై విషం చిమ్మకండి..! దశాబ్దకాలంలో ఏం చేశారో విషయం చెప్పి ఓట్లడగండి.. ప్రధానిగా పదేళ్లు గడిచినా.. తెలంగాణ ప్రధాన హామీలను ఎందుకు మరిచారో చెప్పండి. ఒక్క తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుకు.. ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదో చెప్పండి. మా యువతకు ఉపాధినిచ్చే... కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఎందుకు పాతరేశారో చెప్పండి.. మా ఏజెన్సీ బిడ్డలకు బతుకు దెరువునిచ్చే.. బయ్యారం స్టీలు ఫ్యాక్టరీని ఎందుకు బొందపెట్టారో చెప్పండి. మా నవతరానికి కొండంత భరోసానిచ్చే.. ఐటీఐఆర్ ఐటీఐఆర్, హైదరాబాద్ ప్రాజెక్టును ఎందుకు ఆగం చేశారో చెప్పండి. తమ పిల్లల బంగారు భవితపై ఆశలు పెట్టుకున్న.. లక్షలాది తల్లిదండ్రుల ఆశయంపై ఎందుకు నీళ్లు జల్లారో చెప్పండి. తెలంగాణకు ఒక్క నవోదయ, ఒక్క మెడికల్ కాలేజీ.. ఒక్క నర్సింగ్ కళాశాల, ఒక్క ఐఐటీ, ఒక్క ట్రిపుల్ ఐటీ.. ఒక్క ఐఐఎం, ఒక్క ఐసర్, ఒక్క ఎన్. ఐ. డీ. ఎందుకు ఇవ్వలేదో చెప్పండి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్రం గుప్పిట్లో పెట్టుకుని.. మా రైతులపై ఎందుకు పెత్తనం చేస్తున్నారో చెప్పండి. లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండినా.. 200కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా.. కాంగ్రెస్ సర్కారు పాపానికి నేతన్నలు బలైపోతున్నా.. తెలంగాణ వైపు ఎందుకు కన్నెత్తి చూడలేదో చెప్పండి. చేనేత రంగంపై జీఎస్టీ వేసి.. మగ్గానికి ఎందుకు మరణశాసనం రాశారో చెప్పండి. తెలంగాణకు కష్టపడి తెచ్చుకున్న పరిశ్రమలను.. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎందుకు తన్నుకుపోతున్నారో చెప్పండి. మండిపోతున్న నిత్యవసర ధరలను. ఎందుకు అదుపు చేయలేకపోయారో చెప్పండి. ముడి చమురు ధరలు తగ్గినా.. మోదీ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదో చెప్పండి. భావోద్వేగాలు రెచ్చగొట్టడం కాదు.. మీరిచ్చిన 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందో చెప్పండి. సబ్ కా సాత్, అచ్చే దిన్ లాంటి నినాదాలు.. ఎందుకు విధానాలుగా మారలేదో చెప్పండి. మీ పాలనలో పదేళ్లు గడిచినా.. ఇంకా ఉచిత రేషన్ పథకం కింద.. 80 కోట్ల పేదలు ఎలా ఉన్నారో చెప్పండి. అవినీతిపరులకు మీ పార్టీలో ఆశ్రయమిచ్చి.. రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను.. ఎందుకు ప్రయోగిస్తున్నారో చెప్పండి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు రాసిన.. భారత రాజ్యాంగంపై ప్రజల సాక్షిగా ప్రమాణం చేసి.. అదే రాజ్యాంగాన్ని అందరి కళ్లముందే కాలరాయకండి. దేశ ప్రధాన మంత్రిగా.. ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా.. ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నాలు చేయకండి. దేశం కోసం ఏదైనా "విజన్" ఉంటే చెప్పండి. కానీ.. దయచేసి సమాజంలో "డివిజన్" మాత్రం సృష్టించకండి. చివరగా ఒక మనవి... రెచ్చగొట్టే రాజకీయాలకు.. ఇక్కడ ఓట్లు పడవు. ఎందుకంటే.. ఇది తెలంగాణ గడ్డ.. ప్రజా చైతన్యానికి అడ్డా" అని కేటీఆర్ తెలిపారు.




## మల్కాజిగిరిలో ఏ సర్వే సంస్థకూ అందని ఫలితాలు

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్, భారాస అభ్యర్థులు ప్రజలకు తెలియదని.. వాళ్లకు డిపాజిట్లు దక్కే అవకాశం లేదని మల్కాజిగిరి భాజపా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ సర్వే సంస్థకూ అందని ఫలితాలు మల్కాజిగిరిలో వస్తాయని తెలిపారు. మైనారిటీలు కూడా భాజపాకు ఓటు వేస్తామని చెబుతున్నారన్నారు. తన ఇరవై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పుడున్న కలుషిత రాజకీయాలను చూడలేదని వ్యాఖ్యానించారు. "ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. కాళేశ్వరం అవినీతిపరులపై చర్యలు తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోంది. ఈ ప్రభుత్వంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది. ఎన్నికల్లో ఓట్లు పడవని తెలిసి ఇప్పుడు రైతు భరోసా నిధులు విడుదల చేశారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయి. హస్తం పార్టీకి ఓటు వేస్తే కేంద్రంలో ఒరిగేది ఏమీ లేదు. రేవంత్ రెడ్డి వీడియో, ఆడియోలు మార్ఫింగ్ చేసి కేసీఆర్‌ను మించిపోయారు. నాలుగు నెలల్లోనే ఆయన అబద్ధాలకోరని అర్థమైంది. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించింది ప్రధాని మోదీ. భాజపా రిజర్వేషన్లు తొలగిస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇండియా కూటమిలో ఎవరు ప్రధాని అవుతారనే అంశంపై స్పష్టత లేదు. సంకీర్ణ రాజకీయాలకు కాలం చెల్లింది.. రాహుల్ గాంధీ ప్రధాని కాలేరు" అని ఈటల రాజేందర్ అన్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఒడిషా నవీన్ కి ఉన్న ధీమా జగన్ - బాబులకు లేవా !?

పొరుగునే ఒడిషా ఉంది. దానికి నిరాటంకంగా ఇరవై నాలుగేళ్ళుగా ఒకే ఒక ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ కొనసాగుతున్నారు. ఆయన బిజూ జనతా దళ్ ని 1997లో స్థాపించి దాదాపుగా మూడు దశాబ్దాలుగా తనదైన ముద్రను ఒడిషాలో వేసుకున్నారు. ఆయనను తప్ప ముఖ్యమంత్రిగా మరొకరిని చూడడానికి సాహసించని తీరున ఒడిషా ప్రజలు ఉన్నారు అంటే ఆ గొప్పదనం నవీన్ దే. దాదాపుగా ఎనభై ఏళ్ల ప్రాయానికి చేరువ అవుతున్నా నవీన్ నే మళ్లీ సీఎం కావాలని అక్కడ ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లుగా సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఏపీలో పాటుగానే మే 13న ఒడిషాలో పోలింగ్ మొదటి దశ మొదలవుతుంది. నాలుగు దశలుగా అక్కడ పోలింగ్ సాగనుంది. ఒడిషాలో ఈసారి ఎలాగైనా గెలిచి సీఎం పీఠం ఎక్కాలని బీజేపీ ఆరాటపడుతోంది. నరేంద్ర మోడీ అమిత్ షాలు ఒడిషాను వరసబెట్టి కలియ తిరుగుతున్నారు. విస్తారంగా ఎన్నికల సభలలో పాలు పంచుకుంటున్నారు. అయినా సరే నవీన్ ఎక్కడా బెణక్కుండా ఒణక్కుండా ధీమాగా ఉన్నారు. ఇక బిజూ జనతాదళ్ కీలక నేతలు అయితే జూన్ 9న నవీన్ పట్నాయక్ సీఎం గా మరోసారి ప్రమాణం చేస్తారు అని ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. అంటే నవీన్ విజయం పట్ల ఆ పార్టీకి ఉన్న ధీమా అది. అదే ఏపీలో చూస్తే అయిదేళ్ళ పాటు సీఎం గా పనిచేసిన జగన్ సెకండ్ టెర్మ్ తానే అని గట్టిగా చెబుతున్నా టైం డేట్ ముహూర్తానికి ఫిక్స్ చేయడం లేదు. వైసీపీ కూడా ఈ విషయంలో గుంభనంగా ఉంది. మళ్లీ మాదే అధికారం అని వైసీపీ అంటోంది కానీ అక్కడితోనే ఆగిపోతోంది. ఇక ఈసారి ఆరు నూరు అయినా టీడీపీ కూటమిదే అధికారం అని చంద్రబాబు అంటున్నారు. పాతికకు పాతిక ఎంపీ సీట్లు అలాగే 160 కి తగ్గకుండా ఎమ్మెల్యే సీట్లు కూటమికి వస్తాయని ధీమాగా చెబుతున్న చంద్రబాబు అంతే ధీమాగా జూన్ లో ఫలనా రోజు సీఎం గా ప్రమాణం చేస్తాను అని ఎందుకు చెప్పడం లేదు అన్న ప్రశ్నలు వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే ఒడిషాలో ఒక బలమైన జాతీయ పార్టీ బీజేపీతో హోరా హోరీ పోరు సాగిస్తూ ఇప్పటికి అయిదు టెర్ములు సీఎం గా ఉన్నా కూడా నవీన్ మళ్లీ గెలుస్తాను అని అంటున్నారు. డేట్ ఫిక్స్ చేసుకుని కూర్చున్నారు. కానీ సింగిల్ టెర్మ్ పూర్తి చేసి మరోసారి చాన్స్ కోసం జనాల వద్దకు వెళ్తున్న జగన్ అలాగే ఎపుడూ వరసగా రెండవ టెర్మ్ పూర్తి చేయని చంద్రబాబులకు మాత్రం ఏపీ పాలిటిక్స్ లో అంత ధీమా కనిపించడం లేదా అన్న చర్చ వస్తోంది. హోరా హోరీ పోరు ఏపీలో సాగుతోంది. దాంతో ఎవరు విజేతలు అన్నది అధినేతలకూ అంతుపట్టడం లేదా అన్న ప్రశ్నలు వస్తున్నాయి మరి.

# ప్రచారం కన్నా.. సమీక్షలే మిన్నా..!



నల్గొండ : లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి మరో ఏడు రోజులే గడువు ఉన్నా.. గతంలో పోలిస్తే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రచారం ఊపందుకోలేదు. భాజపా, సీపీఎం మాత్రమే గత కొన్ని రోజులుగా నల్గొండ, భువనగిరి లోక్‌సభ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేస్తుండగా.. మిగిలిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం కంటే సమీక్షలు, వ్యూహ రచనలకే ప్రాధాన్యమిస్తున్నారు. రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఉదయం నుంచే ఎండలు మండిపోతుండటం, సగటున 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అభ్యర్థులు సైతం ప్రచారానికి సుముఖత చూపించడం లేదు. ప్రధాన పార్టీల్లో ఆయా ముఖ్యనేతలు వచ్చినప్పుడు రాత్రి పూట ఏర్పాటు చేసే రోడ్‌షోలు, కార్నర్ సమావేశాల్లోనే ఎక్కువ మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. కొన్ని చోట్ల ఉదయపు నడక, అవసరం అనుకుంటే ఉదయం 9 గంటల వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాలు, మండలాల వారీగా కార్యకర్తలతో పార్టీ అంతర్గత సర్వేలు, వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారంపై సమీక్షలు చేస్తూ ఎక్కడ బలహీనంగా ఉన్నామో అక్కడ ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఇతర పార్టీల్లో కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధులు, మాజీలకు ఫోన్లు చేస్తూ తమకు మద్దతివ్వాలని కోరుతున్నారు. ప్రధాన పార్టీల అధిష్ఠానాలు సైతం ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, భువనగిరి స్థానాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ లోపాలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలు సూచిస్తున్నాయి. రెండు స్థానాల్లో అధికార కాంగ్రెస్ ఒక వైపు మండలాల వారీగా విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహిస్తూ మండల కేంద్రాల్లో రాత్రి రోడ్‌షోలు, కార్నర్ సమావేశాలను నిర్వహిస్తోంది. నల్గొండలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భువనగిరి స్థానాల్లో పార్టీ అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తోడుగా ప్రచారం చేస్తున్నారు. లోక్‌సభ పరిధి పెద్దది కావడం, అన్ని గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని ముఖ్య నాయకులతో గెలుపు వ్యూహాలపై చర్చించి వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలకే ఎక్కడికక్కడ సమన్వయ బాధ్యతలు అప్పగించారు. రెండింటిలోనూ ఏడు సెగ్మెంట్లకు గానూ ఆరుగురు ఎమ్మెల్యేల చొప్పున కాంగ్రెస్ వారే ఉండటంతో ఇది అధికార పార్టీకి అదనపు బలం కానుంది.

ఈ ఎన్నికల్లో రెండింటిలో కనీసం ఒకదాంట్లోనైనా గెలుపు తీరాలను చేరాలని భాజపా సర్వశక్తులు ఒడ్డుతోంది. రేపు (సోమవారం) భువనగిరి, నల్గొండలో జరిగే పార్టీ అభ్యర్థుల ప్రచారానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా రానున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించిన నాయకులు, పోలింగ్ నాటికి మండలాల్లో కనీసం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి వాటిలో అభ్యర్థులు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు గతంలో భారాస నుంచి ప్రజాప్రతినిధులుగా గెలుపొందడంతో ఆ పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలకు తమకు మద్దతునివ్వాలని కోరుతున్నట్లు తెలిసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నైరాశ్యంలో ఉన్న భారాస ఇటీవల ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన కేసీఆర్ బస్సుయాత్రతో కొంత జోష్ వచ్చింది. నల్గొండ, భువనగిరి రెండు స్థానాల్లోని అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్ క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లోనే ఇప్పటి వరకు ప్రచారం చేయడంతో మిగిలిన ప్రాంతాల్లోని నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసినా..క్షేత్రస్థాయిలో ముఖ్య నాయకులు మాజీ ఎమ్మెల్యేల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో పరిస్థితిని చక్కదిద్దాలని పార్టీ అధిష్ఠానం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆదేశించడంతో ఆయన శనివారం ఇద్దరు అభ్యర్థులతో పార్టీ ప్రచారం, ఇతర అంశాలపై చర్చలు జరిపినట్లు తెలిసింది.

# ఆ ఎద్దడి మనకొద్దు.. అప్రమత్తతే ముద్దు



సూర్యాపేట : ప్రస్తుతం బెంగళూరు నగర నీటి సంక్షోభం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. సిలికాన్ సిటీ నీటి సమస్యతో కేప్‌టౌన్ నగరం పేరు తెరమీదకు తీసుకొస్తున్నారు. అక్కడ ఆరేళ్ల కింద తలెత్తిన నీటి సంక్షోభం ప్రపంచంలోనే తీవ్రమైనదిగా పరిగణిస్తుంటారు. ప్రస్తుతం బెంగళూరు నగరవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరముంది.

జిల్లాలో ఇలా..జిల్లాలోని గ్రామాలు, అయిదు పురపాలికల్లో జల వనరులు అడుగంటుతున్నాయి. దీనికి తోడు నీటి వృథా అవుతున్నాయి. ఇప్పటికే అక్కడక్కడ నీటి వనరుల్లో కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలమట్టం పడిపోవడం, అడుగంటుతున్న జలాశయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ విషయాలపై అధికారగణం అప్రమత్తం.. ప్రజలు చైతన్యమై నీటి వృథాని అరికట్టడానికి సిద్ధం కావాల్సిన తరుణమిది. జిల్లాలో నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతానికి తీవ్ర కరవు పరిస్థితులు లేవనే ధీమాలో ఉన్నా.. రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలను దరిదాపుల్లోకి రానీయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని గ్రామాలతో పాటు పురపాలికల్లో ప్రతి పౌరుడు రోజుకు ఒక లీటరు నీటిని పొదుపు చేసినా.. అది నీటి బ్యాంకులో రోజుకు 54,08,800 లీటర్లు ఆదా అవుతుంది.

కారణాలేంటి..నీటి సంక్షోభం తలెత్తినా దానికి మానవ తప్పిదాలే కారణమన్నది సుస్పష్టం. వాతావరణం మార్పులకు గురి కావడానికి మనిషి కొనసాగిస్తున్న కార్యకలాపాలే కారణం. ముఖ్యంగా జిల్లాలోని అయిదు పురపాలికల్లో చెరువులను ఆక్రమించి ప్లాట్లుగా మార్చటం.. నీటి వనరుల సంరక్షణ చేపట్టకపోవడంతో వేసవిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు చర్యలు తీసుకోకపోవటంతో వాన నీరింకే పరిస్థితి లేకుండా పోయింది.

# సాంకేతికత వినియోగం పారదర్శకతకు దోహదం



సంగారెడ్డి : ప్రజాస్వామ్యంలో ఎన్నికలే కీలకం. ఇవి పారదర్శకంగా జరగాలి. ఓటు హక్కు ఉన్న వారంతా వినియోగించుకోవాలి. ఈ రెండు సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. ఎన్నికల క్రతువు సజావుగా నిర్వహించినపుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతుంది. ఇందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఎన్నికల విధానంలో మార్పులు చేస్తూ వస్తోంది. నూతన సాంకేతికతను వినియోగించి ప్రజల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్న వారిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టింది.

షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గత నెల 9న షెడ్యూలు విడుదల కాగా అప్పటి నుంచే కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. గత నెల 29న అభ్యర్థుల తుది జాబితా కూడా విడుదలైంది. బరిలో ఉన్న అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారం ఉద్ధృతంగా కొనసాగుతోంది. ప్రలోభాల పర్వానికి తెరలేచింది. వీటిపై ఫిర్యాదులు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.

సందేహాల నివృత్తికి..: ఓటరు హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ-1950 ద్వారా 8 రకాల సేవల్ని అందిస్తున్నారు. పోలింగ్, ఎన్నికల క్రతువు సజావుగా నిర్వహించేందుకు ఫిర్యాదులు, అభిప్రాయాల స్వీకరణ, ఎన్నికల అధికారికి సంబంధించిన వివరాలు, లోక్ సభ నియోజకవర్గ సమాచారాన్ని ఓటర్లకు తెలియజేయడం, ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రం చిరునామా, ఎన్నికల సమాచారం, 24 గంటలు ఓటర్లకు సహాయం అందించడం వంటి సేవలు ఇందులో ఉన్నాయి. ఇక్కడ సిబ్బంది షిఫ్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఫోన్ చేసిన వారి వివరాల నమోదుకు ప్రత్యేకంగా రిజిస్టర్‌ను నిర్వహిస్తున్నారు. అదే సమయంలో సంబంధిత వెబ్‌సైట్‌లోనూ వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 184 మంది సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

ఉల్లంఘనుల ఆటకట్టించేందుకు..

ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించే వారిని నియంత్రించడంలో సీ-విజిల్ యాప్ కీలకంగా మారింది. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే పౌరులు ఎవరైనా నేరుగా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. దీనికి సంబంధించిన ఫొటో, వీడియో అప్‌లోడ్ చేయాలి. దీని ఆధారంగా అధికారుల బృందాలు వెంటనే అక్కడికి చేరుకుంటాయి. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే పరిష్కరిస్తాయి. ఇప్పటి వరకు 41 ఫిర్యాదులు అందగా పరిశీలించి చర్యలు తీసుకున్నారు.

జాతీయ స్థాయిలో ఎన్‌జీఆర్ఎస్

జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ వ్యవస్థ ద్వార కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం(ఎన్‌జీఆర్ఎస్) ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఈ వెబ్‌సైట్‌పై ప్రజలకు అవగాహన అంతంతమాత్రమే.

# దుబ్బాకలో లోకల్ దారి

చేగుంట: నియోజకవర్గంలోని ఓటర్లందరినీ ఒకేరకమైన హామీతో ప్రసన్నం చేసుకోవాలనుకుంటే కొంత ఇబ్బందే. ఒక్కోచోట ఒక్కో సమస్య ప్రభావితం చేస్తుంది. కొన్నిచోట్ల మహిళలు ఎక్కువగా ఉంటే.. మరోచోట కార్మికులు అధికంగా ఉంటారు. మరోచోట నిర్వాసితులు ఓట్లు పడేతీరును ప్రభావితం చేస్తారు. ఈ విషయాన్ని గమనించిన పార్టీలు, అభ్యర్థులు, నాయకులు ఎక్కడికక్కడ ప్రచారంలో స్థానిక సమస్యలు, అంశాలను ప్రస్తావిస్తున్నారు. తాము ఎలా వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యత్నిస్తామో ఓటర్లకు చెబుతున్నారు. రోడ్డుషోలలో ప్రధాన నాయకులు దేశం, రాష్ట్రం స్థాయి అంశాలు ప్రస్తావించినా.. స్థానిక నాయకులు ఇంటింటి ప్రచారంలో మాత్రం స్థానికతకు పెద్దపీట వేస్తున్నారు.

పట్టు నిలపడానికి గట్టి యత్నం

పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ప్రధానంగా భాజపా, కాంగ్రెస్, భారాస నాయకులు మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని దుబ్బాక నియోజకవర్గ పరిధిలో ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో భారాస అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి 97,879 ఓట్లు వచ్చాయి. భాజపా అభ్యర్థి రఘునందన్‌రావుకు 44,366 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి 24,947 ఓట్లు సాధించారు. భారాస ప్రభుత్వం పోయి కాంగ్రెస్ రావడంతో పట్టు నిలుపుకోవడానికి రెండు పార్టీలూ యత్నిస్తున్నాయి. భాజపా అభ్యర్థి రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తున్నారు. నరేంద్ర మోదీ చరిష్మా భారాస, కాంగ్రెస్‌ల కంటే ముందుంచుతుందని భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా ప్రభావితం చేసే అంశం మల్లన్నసాగర్ భూనిర్వాసితుల పరిహారం. దీనిని మూడు పార్టీలు వారి శైలిలో ప్రత్యర్థి పార్టీల వారే కారణమంటూ ఆరోపించుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. భాజపా నాయకులు పట్టణ ఓటర్లపై ఎక్కువగా దృష్టి పెట్టారు.

బంధుగణంతో మహిళా ఓటర్లు

భారాస అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో పాటు ఆయన బంధుగణం ఇంటింటి




ప్రచారం చేస్తున్నారు. వియ్యంకులు, తమ్ముళ్లు, భార్య, కుమార్తె, కుమారుడు మహిళ ఓటర్లను కలుస్తున్నారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి తామేం చేయనున్నారో వివరిస్తున్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీల మోసపూరితమని చెబుతున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం భారాస నేతలు, ప్రజాప్రతినిధులు మిగతాచోట్ల మాదిరి ఇతర పార్టీలోకి వెళ్లడం తక్కువగా ఉంది. చేగుంట, నార్సింగి, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో ఇంటింటి ప్రచారం పూర్తి చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మల్లన్నసాగర్ నిర్మాణం వల్లనే వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని వివరిస్తున్నారు.

నీలం మధు: రోడ్డుషోల్లో గ్యారంటీలు

కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థి నీలం మధు చేగుంట, నార్సింగి, మిరుదొడ్డి, అగ్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో రోడ్డుషో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. చేగుంటలో మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓట్ల సాధనలో ఎక్కడెక్కడ వెనుకబాటు ఉందో అక్కడి ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహం పన్నుతున్నారు. భారాస నుంచి ముఖ్యనాయకులను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. ఆరు గ్యారంటీల అమలును ప్రజలకు వివరిస్తున్నారు.

రఘునందన్‌రావు: ఉదయపు నడకలో కేంద్ర పథకాలపై..

భాజపా అభ్యర్థి రఘునందన్‌రావు.. ఉదయపు నడకలో ఓటర్లను కలుస్తున్నారు. కేంద్ర పథకాలు, నరేంద్ర మోదీ సాధించిన విజయాలపై వివరిస్తున్నారు. కాంగ్రెస్, భారాసల వల్ల నష్టమేనని ఆరోపిస్తూ ఇంటింటి ప్రచారంలో చెబుతున్నారు. చేగుంట, దుబ్బాక, నార్సింగి, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్, అగ్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం పూర్తి చేశారు. అయోధ్య రామాలయం, 370 అధికరణ, పేదలకు బియ్యం పంపిణీ లాంటివి చేశామని ప్రచారం చేస్తున్నారు. చేగుంట మండలంలో 14 రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. వారి ఓట్లపై భరోసాతో ఉన్నారు. ఉపాధి హామీ కూలీలను కలిసి కూలీ మొత్తాన్ని రూ.300 చేశామంటున్నారు.

# గ్రామీణులపైనే ఆశలు

కామారెడ్డి : లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో వేగం పెంచాయి. భారాస, కాంగ్రెస్, భాజపా అభ్యర్థులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ఓటర్ల మద్దతు కూడగట్టేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్‌శాతం తక్కువగా నమోదవుతుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2019 సార్వత్రిక ఎన్నికల్లో పట్టణప్రాంతాల్లో 60 శాతానికి మించి పోలింగ్ నమోదు కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో 70 నుంచి 75 శాతం నమోదవుతోంది. దీంతో పార్టీలన్నీ పల్లె ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నాయి.

వలసలూ ఓ కారణం జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలుండగా.. కామారెడ్డి, జహీరాబాద్‌లలో పట్టణ జనాభా అధికంగా ఉంది. 2019లో జరిగి సార్వత్రిక ఎన్నికల్లో కామారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ నమోదైంది. కామారెడ్డి, జహీరాబాద్ పట్టణ ప్రాంతాల్లో 50 నుంచి 55 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఇక వలసల కారణంగా నారాయణఖేడ్‌లో తక్కువ పోలింగ్ నమోదైనట్లు నిర్ధారణ జరిగింది. రవాణా వ్యయం, ఉపాధి సమస్య కారణంగా పలువురు వలస కూలీలు సార్వత్రిక ఎన్నికల్లో ఓటువేసేందుకు నిరాసక్తత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

హోరెత్తుతున్న ప్రచారం జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో పాగా వేసేందుకు భారాస, కాంగ్రెస్, భాజపా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రత్యర్థి పార్టీల ప్రచార సరళిని గమనిస్తూ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రచారం సాగిస్తున్నాయి. ఇందులో భాగంగానే మూడు పార్టీలు పల్లెల్లో ఇంటింటి ప్రచారం చేపడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లకు తమ పార్టీల విధానాలు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నాయి. కూలీలు ఉపాధి పనులకు వెళ్తుండడంతో రాజకీయపార్టీల నాయకులు అక్కడికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే పల్లెల్లో మొదటి విడత ప్రచారం పూర్తిచేసిన పార్టీలు రెండో విడత ప్రచారం చేపట్టాయి.

# నేనేంటీ.. నాకింత విలువేంటి..!

నాంపల్లి : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారంతో పాటు చేరికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ.. ఇంటింటి ప్రచారం, రోడ్డుషోలు, ర్యాలీలు నిర్వహిస్తూ రాజకీయాన్ని వేడెక్కిస్తూనే.. మరోవైపు రోజుకో చోట ఏదో ఒక పార్టీ వారిని తమ పార్టీలో చేర్చుకుంటూ తమ బలగాన్ని పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీల్లో కొన్ని రోజులుగా చేరికలు ఊపందుకున్నాయి. వాస్తవానికి ఈ చేరికలు 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే కొనసాగుతున్నాయి. పార్టీలో చేరుతున్న వ్యక్తికి అంతకు ముందు పార్టీలో సభ్యత్వం ఉందా.. అతడు కార్యసాధకుడేనా.. ఇవేమీ అవసరం లేకుండా సామాన్య ఓటరైనా ఫర్వాలేదు.. చేరికల సంఖ్య భారీగా ఉండాలనే తపన ఆయా పార్టీల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సామాన్యుడికి కొత్తగా కండువా భుజాన పడగానే నాకింత విలువుందా అని సంబరపడుతున్నారు.

స్థాయికి మించి డిమాండ్

ఆయా పార్టీల్లో చేరుతున్న వారంతా సంబంధిత పార్టీలపై ఉన్న



అభిమానం, అభ్యర్థిపై ఉన్న మమకారంతో చేరుతున్నారనుకుంటే పొరపడినట్లే. పార్టీలో చేరడానికి ముందే నాయకులకు బేరసారాలతో దిగుతున్నట్లు తెలుస్తోంది. ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారి కండువా కప్పుకోవడానికి సిద్ధమవుతుండగా.. మరికొందరు స్థానిక రాజకీయ పార్టీల నాయకుల ప్రోద్బలంతో ఆయా పార్టీల్లో చేరుతున్నారు. కొందరు స్థాయికి మించి డబ్బు డిమాండ్ చేస్తుండటంతో ప్రధాన పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. వారికిచ్చే మొత్తాలు ప్రచార వ్యయాన్ని మించిపోతుండటంతో కొందరు నాయకులు వేచి చూసే ధోరణి అవలంబిస్తుండగా.. మరి కొందరు ఏదో ఒక హామీ ఇస్తూ కండువాలు కప్పుతున్నారు. చివరికి కండువాలు కప్పుకున్న వారంతా ప్రచారంలో పాల్గొంటున్న దాఖలాలు లేవు. నాయకులు వచ్చినప్పుడు మాత్రమే దర్శనమిస్తూ ఆ తర్వాత కనుమరుగవుతున్నారు.

గుర్తింపు కార్డు లేకపోయినా..

వాస్తవానికి ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరుతున్నారంటే వారి వద్ద అదివరకు పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు ఉండాలి. తాజాగా పార్టీలు మారుతున్న వారిలో 10 శాతం మందికి కూడా ఈ కార్డులు లేవు. కనీసం ఆ పార్టీలో ఎటువంటి పదవులు అనుభవించకపోయినా.. తాము సీనియర్ నాయకులమంటూ ఏ పార్టీలో గుర్తింపు కార్డు లేని వారిని తమ అనుచరులుగా చూపించి సామాన్య ఓటర్లకు సైతం సామూహికంగా కండువాలు కప్పేస్తున్నారు.

# ఎట్టకేలకు కేజీబీవీ నిర్మాణం ప్రారంభం

హుస్నాబాద్ : ఎట్టకేలకు అక్కన్నపేట కేజీబీవీ భవన నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. రెండున్నరేళ్ల క్రితం ప్రారంభించిన ఈ భవన నిర్మాణ పనులు ఏడాది క్రితం వివిధ కారణాలతో అర్ధంతరంగా ఆగిపోయాయి. ఎవరూ పట్టించుకోక పోవడంతో అప్పటి నుంచి పనులు చేపట్టలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తిరిగి ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. అక్కన్నపేట మండల కేంద్రంలో నడుస్తున్న కేజీబీవీ పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 3.50 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణం కోసం స్థానిక పెట్రోల్‌బంక్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం 5 ఎకరాలు కేటాయించారు. ఈ స్థలంలో భవన నిర్మాణ పనులకు 2021 సెప్టెంబర్ 17న మంత్రి హరీశ్‌రావు అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో కల్సి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణాన్ని దక్కించుకున్న గుత్తేదారు మొదట్లో పనులను వేగంగా చేపట్టారు. మూడు అంతస్తుల వరకు స్లాబ్ పూర్తి చేశాడు. రెండు అంతస్తుల వరకు లోపల తరగతి గదుల గోడల నిర్మాణం పూర్తి చేశారు. మూడో అంతస్తుకు స్లాబ్ వేసిన తర్వాత బిల్లులు రావడం లేదనే కారణంతో వదిలేశారు. అప్పటి నుంచి



పనులు నిలిచిపోయాయి. ఎవరూ పట్టించుకోక పోవడంతో సుమారు ఏడాది గడుస్తున్నా పనులు తిరిగి ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అర్ధాంతరంగా ఆగిన ఈ పనుల గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల ద్వారా తెల్సుకున్నారు. గుత్తేదారుతో మాట్లాడి బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి పనులు పూర్తయ్యేలా, బవనం అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరారు. ఈ మేరకు గుత్తేదారు వారం రోజుల క్రితం పనులు తిరిగి ప్రారంభించారు. మొదటి రెండు ఫ్లోర్లలో ప్లాస్టరింగ్ పనులు చురుకుగా జరుగుతున్నాయి. తీరనున్న అవస్థలు.. ప్రస్తుతం నడుస్తున్న పనుల తీరును చూస్తుంటే వచ్చే విద్యాసంవత్సరం నాటికి పాఠశాల భవనం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం స్థానికంగా ఉన్న ఓ అద్దె భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. సుమారు 155 మంది విద్యార్థులు చదువుతున్నారు. అద్దె భవనంలో వారందరికీ సరిపడే సౌకర్యాలు లేవు. తరగతి గదులు ఇరుకుగా ఉన్నాయి. డార్మిటరీ, భోజనశాల, మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేవు. అయినా ఎలాగోలా సర్దుబాటు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

# అన్నీ ఒకేచోట.. ఇబ్బంది లేదిక



హైదరాబాద్ : ఇంధనాలన్నీ ఒకే చోట ఉండేలా కొత్త బంకులు అందుబాటులోకి వస్తున్నాయి. నగరంలో విద్యుత్తు వాహనాల (ఈవీ) వినియోగం పెరుగుతుండటంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను నెలకొల్పారు. కొత్తగా నిర్మిస్తున్న బంకుల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తోపాటు ఈవీ ఛార్జింగ్ మిషన్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఈవీలు సైతం బంకుల బాట పట్టనున్నాయి. ఇందుకు అనుగుణంగా నిర్వాహకులు వసతులు కల్పిస్తున్నారు. ఈ తరహా బంకులు ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ప్రారంభం కాగా.. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.

50 సెంట్ల విస్తీర్ణంలో..

కనీసం 50 సెంట్ల స్థలంలో కొత్త బంకుల నిర్మాణం జరుగుతోంది. ఇందులో 50 శాతం స్థలాన్ని పెట్రోల్, డీజిల్ పంపులు, ఈవీ ఛార్జింగ్ మిషన్ల ఏర్పాటుకు కేటాయించారు. మిగిలిన స్థలాన్ని పచ్చదనం పెంపొందించేందుకు, ఈవీ వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, రెస్టారెంట్‌ల నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు. ఛార్జింగ్ సమయంలో నిరీక్షించడానికి ఏసీ, ఫర్నీచర్‌తో కూడిన విశ్రాంతి గదులతో పాటు రెస్టారెంట్, కాఫీ షాపులు నిర్మిస్తున్నారు. అధునాతన సాంకేతికతతో కూడిన మరుగుదొడ్లు ఏర్పాటవుతున్నాయి తరహా బంకులు మొయినాబాద్, హయత్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉండగా.. సికింద్రాబాద్‌లో ఇటీవల ఓ బంకును ప్రారంభించారు.

పెరుగుతున్న ఈవీల వినియోగం

రాష్ట్రవ్యాప్తంగా 2021 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 14 వరకు సుమారు 1.40 లక్షల ఈవీ వాహనాలు కొనుగోలు చేశారు. ఇందులో సుమారు 80 శాతం నగరానికి చెందినవే. ఓ సంస్థ నివేదిక ప్రకారం.. విద్యుత్తు కార్లను ఫుల్ ఛార్జ్ చేసేందుకు 20 నుంచి 30 యూనిట్ల విద్యుత్తు అవసరం. దీని కోసం ఛార్జర్ సామర్థ్యం బట్టి 6 నుంచి 8 గంటల సమయం పడుతుంది. బైక్‌లకు ఫుల్‌ఛార్జింగ్ పెట్టడానికి సుమారు 4 గంటలు పడుతుంది. దీంతో కొత్త బంకుల యజమానులు వసతులు కల్పిస్తున్నారు.

# అప్రమత్తతే శ్రీరామరక్ష



సూర్యాపేట : మిర్యాలగూడ పట్టణంలో శనివారం దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఏప్రిల్ 27న కొండమల్లేపల్లిలోని ఓ సామిల్ (కట్టెల మిల్లు)లో జరిగిన విద్యుదాఘాతంతో సుమారు రూ. 30 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి సుమారు 16.72 లక్షల విద్యుత్తు వినియోగదారులున్నారు. తరచూ ఎక్కడో ఓ చోట విద్యుత్తు ప్రమాదం జరుగుతూనే ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యుత్తు అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా నియంత్రికలను సొంతంగా బంద్ చేయడం, స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేసుకోవడం, నియంత్రికల చుట్టూ కంచె లేకపోవడం, ఇళ్లలో ఎర్తు వస్తున్నా.. పట్టించుకోకపోవడం తదితర కారణాల వల్ల ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ప్రమాదాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

అధికారుల సూచనలు

విద్యుత్తు లైన్ల కింద పందిర్లు, జెండాలు కట్టొద్దు.

ఐఎస్ఐ లేదా ప్రముఖ కంపెనీలకు చెందిన విద్యుత్తు తీగలు, పరికరాలు, పంపులు మాత్రమే వినియోగించాలి. ధర తక్కువ, నాణ్యత, గుర్తింపు లేని వాటిని వినియోగించకూడదు.

నియంత్రికల ఫ్యూజ్‌లను విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, అనధికారికంగా మార్చొద్దు.

సర్వీస్ వైర్లు, విద్యుత్తు వీధి దీపాలను సరి చేసేందుకు ఇతరులు విద్యుత్తు స్తంభాలను ఎక్కకూడదు.

ఇళ్లలో, కార్యాలయాల్లో తప్పని సరిగా ఎర్తు ఏర్పాటు చేసుకోవాలి.

ఇంటి ఆవరణలో విద్యుత్తు వైర్లకు సమీపంలో జి.ఐ, ఇనుప తీగలతో కూడిన దండేలు కట్టి వాటిపై తడి దుస్తులు ఆరవేయొద్దు.

ఏవైనా వస్తువులు విద్యుత్తు తీగలకు చుట్టుకుంటే వాటిని తీసే ప్రయత్నం చేయకూడదు.

అవగాహన కల్పిస్తున్నాం

చంద్రమోహన్, ఎస్ఈ, నల్గొండ

విద్యుత్తు మరమ్మతుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. అధికారులు, సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశిస్తున్నాం. అవగాహన లేని వారు స్వతహాగా విద్యుత్ మరమ్మతులు చేసుకోవద్దని సూచిస్తున్నాం.

జిల్లా వినియోగదారుల సంఖ్య

నల్గొండ 7,22,404

సూర్యాపేట 5,26,087 యాదాద్రి 4,24,061

# మనమే కారణం.. మేల్కోకుంటే దారుణం

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత కొన్ని దశాబ్దాల్లో ప్రజలు అనుభవించని ఎండలను ఈ వేసవిలో చవిచూస్తున్నారు. రికార్డు స్థాయిలో అనేక ప్రాంతాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో.. ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండలు, వడ గాలులతో అనేక మంది ప్రాణాలు సైతం విడుస్తున్నారు. ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాదే ఎందుకు ఎండలు మండిపోతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి.

మితిమీరిన కాలుష్యం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలసిన వివిధ పరిశ్రమల కారణంగా వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. కాలుష్యం కారణంగా కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువులు వాతావరణంలో పెరిగిపోవడంతో భూమి వేడెక్కిపోతోంది. గత కొన్నేళ్లుగా ఏటా వాతావరణంలో ఈ వాయువుల ప్రభావం భారీగా పెరుగుతూ వస్తుంది. దీంతో ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మట్టి రహదారులు కనుమరుగు..

అభివృద్ధి పేరుతో గ్రామాల్లో సైతం మట్టి రహదారులు లేకుండా మొత్తం సీసీ రహదారులు ఏర్పాటు చేయడంతో వేడి పెరిగేందుకు ప్రధాన కారణంగా మారుతుంది. దీని వల్ల వర్షపు నీరు, ఇళ్లలో వాడే నీరు భూమిలోకి ఇంకిపోకుండా కాలువల ద్వారా దూర ప్రాంతాలకు వెళ్తున్నాయి. దీనికి తోడు నీటి కోసం ఎడాపెడా బోర్లు తవ్వుతుండడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోయి.. వేడి పెరిగేందుకు కారణం అవుతోంది.

ఎడాపెడా చెట్ల నరికివేత..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాలను కలుపుతూ భారీ రహదారులు ఇటీవల కాలంలో అనేకం వచ్చాయి. వీటి నిర్మాణానికి, రహదారుల విస్తరణకు అడ్డుగా ఉన్న ఏళ్ల నాటి భారీ వృక్షాలను నేలమట్టం చేశారు. దీని కారణంగా ఉమ్మడి జిల్లాలో అటవీ శాతం సుమారు 5 శాతం పైగా తగ్గిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు అభివృద్ధి పేరిట పెద్ద కొండలు, అడవులను చదును చేస్తూ ఉండడంతో వాతావరణ అసమతుల్యం ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాలో అటవీ శాతం సైతం తక్కువగానే ఉంది.

విపరీతంగా ప్లాస్టిక్ వినియోగం..

ఇక వాతావరణ కాలుష్యం పెరగడంలో ముఖ్యమైన మరో కారణం



ప్లాస్టిక్ వినియోగం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వాడకం మరింత పెరిగిపోయి ఉష్ణోగ్రతలు ఎక్కువవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.

మనమేం చేయాలి..

బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.

ఎవరికి వారే ప్లాస్టిక్ వినియోగాన్ని త్యజించాలి.

వాహనాల వినియోగం వీలైనంతగా తగ్గించి.. ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలి.

ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ పొలాల్లో నీరు, విద్యుత్తు వృథాను అరికట్టాలి.

వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాట్లు చేయాలి.

ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీటిని సైతం భూమిలోకి ఇంకిపోయే ఏర్పాట్లు చేయాలి.

చెట్లు పెంచడమే ఏకైక మార్గం

రావుల శ్రీనివాస్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ

భూతాపాన్ని తగ్గించేందుకు మన వద్ద ఉన్న ఏకైక మార్గం చెట్లను విరివిగా పెంచడమే. లేదంటే భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. చెట్లు పెంచాలనే లక్ష్యంతో పలు ప్రాంతాల్లో ప్లకార్డుతో రోజంతా నిల్చుని ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాను. మొక్కలను పెంచేందుకు ముందుకొచ్చే వారికి నేను ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తాను.

# ఉపాధి కూలీలకు భానుడి సెగ

కొత్తగూడెం : భానుడి భగభగతో ఉపాధి హామీ పథకం కూలీలు పని ప్రదేశాల్లో అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. పనిచేసే చోట ఎలాంటి నీడ, కనీస వసతులు లేక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేకపోతున్నారు. కొన్ని మండలాల్లో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 7 మధ్య బయల్దేరి వెళ్తున్నారు. పనులు పూర్తయి యాప్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదయ్యేటప్పటికి 11 గంటలు దాటుతోంది. సాయంత్రం వేడి వాతావరణం, వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలో వివిధ మండలాల్లో 45 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాతావరణం ఉడికెత్తించేలా ఉందని, కనీస జాగ్రత్తలు తప్పనిసరని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కూలీల ఆరోగ్య సంరక్షణ దిశగా పథకం మండల స్థాయి అధికారులు కనీస చర్యలు చేపట్టాలి.

వసతులు: పథకం నిబంధనల ప్రకారం పని ప్రాంతాల్లో సేదతీరేందుకు నీడ సౌకర్యం కల్పించాలి. మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్యానికి కిట్లు అందించాలి. అరకొర నీటి క్యాన్ల ఏర్పాటుపై కూలీలు పెదవి విరుస్తున్నారు. ప్రాథమిక కిట్ల జాడే లేదు. పంట కాలువలు, చెరువుల పూడికతీత, చెట్ల నరికివేత వంటి పని ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించేలా సిబ్బంది అవగాహన కల్పించాలి.

ప్రమాద బీమా: అధిక ఉష్ణోగ్రతల కారణంగా పని ప్రదేశాల్లో విష



పురుగులు, కందిరీగలు వంటివి దాడి చేసే అవకాశాలెక్కువ. ప్రమాద బీమా రూ. 10 లక్షల వరకు వర్తింపజేయాలన్న కూలీల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. వడదెబ్బ, పాముకాటుతో అత్యధిక మంది కూలీలు మృత్యువాతపడుతున్నారు. బాధిత కుటుంబాలకు పరిహారంతోనే ఉపశమనం దక్కుతుంది.

వేసవి భత్యం: గతంలో ప్రతి కూలీకి వేసవి భత్యం చెల్లించేవారు. తాగునీరు, పరికరాలు, దూర ప్రాంతాలకు రవాణా ఛార్జీ అందించేవారు. మూడేళ్లుగా వీటికి కోత విధించడంపై లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. వీటిని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

పనికి తగ్గ ఫలితం: ఏటా కేంద్ర ప్రభుత్వం కూలి రేటు పెంచుతుంది. అవేమీ పనికి తగిన ఫలితాన్నివ్వడం లేదన్నది కూలీల వాదన. ప్రస్తుతం రోజు కూలి రూ. 300కు పెంచినా ఖాతాల్లో రూ. 200–250 మధ్యే జమవుతోందని వాపోతున్నారు. గిట్టుబాటు కల్పించాల్సిన బాధ్యత అధికారులదే.

ఉపాధి కూలీల కోసం షామియానాలు, షేడ్ నెట్‌లు పంచాయతీల వారీగా సంఖ్యను బట్టి ఇప్పటికే సిబ్బందికి అందజేశాం. ఒక్కో గ్రామానికి ఒకటి నుంచి నాలుగు వరకు అందాయి. వాటిని పనిప్రదేశాల్లో ఏర్పాటు చేసుకుని నీడలో ఉపశమనం పొందేలా ఏర్పాట్లు చేయాలని సూచించాం. చల్లటి మంచినీటి క్యాన్లు రోజూ తెప్పించాలని ఆదేశించాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు కూడా సరఫరా చేశాం. మండల స్థాయి అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు.

రవి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

మొత్తం మండలాలు: 22

గ్రామ పంచాయతీలు: 481

జాబ్‌కార్డులు: 2.19 లక్షలు

కూలీలు: 4.51 లక్షల మంది

# మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

ఖమ్మం : రబీ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు హడావుడి చేసి 236 కొనుగోలు కేంద్రాలు తెరచి నెల రోజులు దాటిపోయింది. ఇందులో కేవలం 70 కొనుగోలు కేంద్రాల్లో 8,760 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో మాత్రమే కొంత మేరకు ధాన్యాన్ని రైతులు కేంద్రాల్లో విక్రయించారు. మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ముగించి, కేంద్రాలు మూసివేయనున్నారు. 1,458 మంది రైతుల నుంచి రూ. 19.21 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా 914 మంది రైతులకు రూ. 12.43 కోట్లు చెల్లించారు. మరో 544 మంది రైతులకు రూ. 6.78 కోట్లు చెల్లించాల్సి ఉంది. రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రబీ సీజన్‌లో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించినా ఆ మేరకు దిగుబడి రాలేదు. వర్షాభావంతో వరి పంట దెబ్బతింది. రబీలో వరి దిగుబడిపై వ్యవసాయ శాఖ



అంచనాలు తప్పాయి. చాలామంది రైతులు బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులకు ధాన్యం విక్రయించారు. ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరకు మించి వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఆశించిన స్థాయిలో ధాన్యం రాలేదు.

రబీలో ధాన్యం కొనుగోలకు అన్ని ఏర్పాట్లు చేశాం. పంట దిగుబడి తగ్గటంతో కేంద్రాలకు ఆశించిన స్థాయిలో రాలేదు. మరో 2 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా. పది రోజుల్లో కేంద్రాలు మూసేయాలని భావిస్తున్నాం. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నాం.

గంటా శ్రీలత, డీఎం, పౌరసరఫరాల సంస్థ, ఖమ్మం

ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు: 236

తెరచినవి: 236

ధాన్యం కొనుగోలు చేసినవి: 70

# మీ ఓటు ఏం చేయగలదో తెలుసా..: ప్రధాని మోదీ



ప్రజల ఓటే భారత్‌ను ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టిందని, ప్రపంచంలో దేశ పరపతి పెంచిందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన మధ్యప్రదేశ్‌లోని ఖర్గోనేలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రజా నిర్ణయంతోనే ఆదివాసి కుమార్తె రాష్ట్రపతి అయ్యారని, మహిళలకు రిజర్వేషన్లు లభించాయని, అవినీతిపరులు జైళ్లకు పోతున్నారని, ఉచిత రేషన్ వస్తోందన్నారు. కాంగ్రెస్ సృష్టించిన గోతులను పూడ్చుకొంటూ వచ్చిన భాజపా మధ్యప్రదేశ్‌కు సరికొత్త ఇమేజ్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. భారత్ చరిత్రలోనే అత్యంత కీలక మలుపు వద్ద ఉందన్నారు. "నేను మంచి చేయబట్టే.. నాకు ఈ రోజుల ప్రజల మద్దతు లభిస్తోంది. వికసిత్ భారత్ కలలను సాకారం చేసుకొనేందుకు మరోసారి మీ ఆశీర్వాదం తీసుకొనేందుకు వచ్చాను. నర్మదా తీరంలోని ప్రజలు ఎవరినీ నిరాశపర్చరని తెలుసు" అని ప్రధాని పేర్కొన్నారు. తమ వారసత్వాలను కాపాడుకొనేందుకే 'ఇండియా కూటమి'లోని పక్షాలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని ప్రధాని తెలిపారు.

తమ సంతానానికి పార్టీలను అప్పజెప్పేందుకే ప్రతిపక్షాలు ఇలా చేస్తున్నాయని దుయ్యబట్టారు. వాటికి ప్రజల సంతోషంతో సంబంధం లేదన్నారు. ప్రతిపక్షాలు ఫేక్ వీడియోలు తయారు చేసే ఫ్యాక్టరీలుగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. ప్రజలు ఏమైనా సరే తమ పని జరగడమే వాటికి ముఖ్యమన్నారు. తనపై ఓట్ జిహాద్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కొన్ని వర్గాలకు పిలుపునిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆ పార్టీ మూర?త్వం ఆ స్థాయిలో ఉందన్నారు. నిరాశ వారిని చుట్టుముట్టిందని తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన నేతలు సంతోషంగా ఊపిరి పీల్చుకొంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. రామమందిరానికి వెళ్లినందుకు మహిళా నేతను ఆ పార్టీ వేధించినట్లు తెలిపారు. మావోయిస్టు, ముస్లిం లీగ్ పార్టీలను కాంగ్రెస్ హైజాక్ చేసిందన్నారు. ఆ పార్టీ యువరాజు సుప్రీం తీర్పును మార్చాలని చూస్తున్నట్లు ప్రధాని ఆరోపించారు.

# కేసీఆర్ కొత్త డ్రామాలకు తెరతీస్తున్నారు: బండి సంజయ్



కరీంనగర్: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కుటుంబ పాలనకు ఓటు వేసినట్లేనని భాజపా ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదో కాంగ్రెస్ చెప్పాలని డిమాండ్ చేశారు. "కేసీఆర్ కొత్త డ్రామాలకు తెరతీస్తున్నారు. మోదీ తనను అరెస్టు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. అవినీతిని భాజపా ప్రభుత్వం సహించదు. కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడింది. ఇక్కడి డబ్బుతో విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కాంగ్రెస్, భారాస నాణేనికి బొమ్మాబొరుసుగా ఉన్నాయి.

ఆస్తులు, అక్రమ సంపాదనపై చర్చకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా? హస్తం పార్టీ ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది. ఆ పార్టీ ఇప్పటివరకు చేసిన అవినీతి అక్రమాలు చాలు. కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు మోసపోవద్దు. అక్రమ సంపాదనతో గెలిచే ప్రయత్నం చేస్తున్నారు" అని బండి సంజయ్ విమర్శించారు.

# కాంగ్రెస్ వస్తే మళ్లీ దేశమంతా బాంబులు పేలుతాయి: రఘునందన్‌రావు




సంగారెడ్డి జిల్లా: ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై మంగళవారం సంగారెడ్డిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే అయోధ్య స్థానంలో మళ్లీ బాబ్రీ మసీదు కడతారని, మళ్లీ దేశమంతా బాంబులు పేలుతాయని అన్నారు. అదే బీజేపీ అధికారంలోకి వస్తే కేవలం దీపావళికి మాత్రమే బాంబులు పేలుతాయన్నారు. బీజేపీ నుంచి రాజకీయం మొదలు పెట్టిన జగ్గారెడ్డి బీజేపీ లేదని మాట్లాడుతున్నారని, సంగారెడ్డి హిందువుల అడ్డ అని పేర్కొన్నారు. అయోధ్య ప్రారంభానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. జగ్గారెడ్డి తల్లిపాలు తాగి రొమ్ము గుద్దుతున్నారని, సంగారెడ్డిని జగ్గారెడ్డి బహిష్కరించడం కాదు.. ప్రజలే జగ్గారెడ్డిని బహిష్కరించారని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు.

**అన్నమలై కామెంట్స్..** 45 డిగ్రీల ఎండలో కూడా ఇక్కడ కార్యకర్తలు సూర్యుడినే భయపెడుతున్నారని.. ఉప ఎన్నికల్లో రఘునందన్ రావు ఎంటనేది అందరికీ తెలిసిపోయిందని అన్నమలై అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎలక్షన్స్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఎన్నికలు అయ్యాక మిగిలిన పార్టీలో ఎవరు ప్రధాని అని గొడవలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో రాహుల్ కూడా అయోమయంలో ఉన్నారని, తెలంగాణలో అభివృద్ధి కావాలంటే కమలం వికసించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. అబద్ధాలతో ప్రభుత్వాన్ని అందుకున్నారని, దేశ భవిష్యత్తు రక్షణ కావాలంటే అది మోదీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్‌కు రామ మందిరాన్ని తాకే హక్కు కూడా లేదన్నారు. మేము రక్తం చిందించి తెచ్చిన అన్ని చట్టాలను కాంగ్రెస్ వస్తే రద్దు చేస్తుందని.. బీజేపీ మతాలకు అతీతమైన పార్టీ అని అన్నమలై వ్యాఖ్యానించారు.

# ఆటోడ్రైవర్లను మోసం చేసిన కాంగ్రెస్.. - చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని వారి బతుకులను రోడ్డుపాలు చేసిందని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ వైఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం భారతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆటోడ్రైవర్లు లైట్‌వేట్ మోటార్ వెహికల్ డ్రైవర్లతో కొండా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కోసం ప్రతినెలా జీవన భృతి కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. ఆటో డ్రైవర్లను రోడ్డు పాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. తాను చేవెళ్లలో ఎంపీగా గెలువగానే ఆటో డ్రైవర్లకు స్వయంగా ఆటోలు కొనుక్కొవడానికి లోన్లు కల్పించడంతో పాటు అర్హులందరికీ ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా సొంత ఇంటికి పంపిస్తానని కొండా హామీ ఇచ్చారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భారతీయ మజ్దూర్ యూనియన్ ముఖ్య నాయకులు సభ్యులు, బీజేపీ నాయులు పాల్గొన్నారు.

**ఇంటింటి ప్రచారంలో సంగీతారెడ్డి** : ఈ నెల 13 న జరగబోయే ఎన్నికల్లో కమలం పువ్వుగుర్తుపై ఓటు వేసి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి విజ్ఞప్తి చేశారు.

మంగళవారం మండలంలోని అమీర్‌పేట, మాణిక్యమ్మగూడ, కేకేబస్తీ, సుభాన్‌పూర్ గ్రామాల్లో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాదవాచారి, మాజీ సర్పంచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





# 90 శాతం ప్రజల హక్కులు కాలరాసేందుకు భాజపా కుట్ర: భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తొలగించేందుకు భాజపా యత్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లను తొలగించేందుకే 400 సీట్లు కోరుతున్నారన్నారు.

రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పెద్దలు అమలు చేసుకుంటూ వచ్చారని వివరించారు. దాని ద్వారానే దళితులు, గిరిజనులకు అవకాశాలు వచ్చాయని తెలిపారు. "దేశంలో సంపద, వనరులు, అధికారం కొద్దిమంది చేతుల్లోనే నలిగిపోతోంది. జనాభా దామాషా ప్రకారం ప్రజలు వనరులు పొందలేకపోతున్నారు. దాని ప్రకారం వనరులను మేం సమానంగా పంచుతాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కులగణన చేపడతాం. ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు తొలగించేందుకు భాజపా ప్రభుత్వం కుట్ర చేస్తోంది. దేశంలోని 90 శాతం ప్రజల హక్కులు కాలరాసేందుకు చూస్తున్నారు. హక్కులను కాపాడుకునేందుకు ఓటు ద్వారా హస్తం పార్టీని నిలబెట్టుకోవాలి. కాషాయ పార్టీకి ఓటు వస్తే భవిష్యత్తు లేకుండా పోతుంది. ఆ పార్టీ హయాంలో దేశ ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడింది. ఆర్ఎస్ఎస్ దేశం కోసం పోరాటం చేస్తున్నట్లు నటిస్తోంది. రాష్ట్రంలో భాజపాకు స్థానం లేకుండా చేయాలి. దేశంలో ఆ పార్టీ అధికారంలోకి రాకుండా బలహీన వర్గాలు కృషి చేయాలి" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# 'రైతుభరోసా' నిధుల పంపిణీపై ఈసీ ఆంక్షలు



హైదరాబాద్, మే 7: తెలంగాణలో రైతు భరోసా పంపిణీపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. రైతుబంధు పంపిణీపై ఈసీ ఆంక్షలు విధించింది. రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసిన తర్వాతే నిధులు విడుదల చేయాలంటూ ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. రైతు భరోసా పథకంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఈసీ ఈ సందర్భంగా పేర్కొంది. మే13న పోలింగ్ ముగిసిన తర్వాతనే పెండింగ్ రైతు బంధు నిధులను పంపిణీ చేయాలంటూ ఈ సందర్భంగా ఈసీ స్పష్టంగా పేర్కొంది. ఈ నెల 9న రైతుబంధు నిధులు పంపిణీ చేస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రకటన ఎన్.వేణు కుమార్ ఈసీకి ఫిర్యాదు చేశారు. రేవంత్ ఎన్నికల నియమావళిని ఉల్లంగించారంటూ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఈసీ.. రేవంత్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. ఎన్నికల తర్వాతే రైతుబంధు నిధులు అంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తెలంగాణలో రైతు బంధు నిధుల పంపిణీకి బ్రేక్ పడినట్లైంది.

# కవితకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగించిన కోర్టు




ఢిల్లీ: దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అయితే రౌస్ అవెన్యూ కోర్టులో ఈ రోజు(మంగళవారం) మరోసారి ఈ కేసు విచారణ జరిగింది. ఈడీ, సీబీఐ కేసుల్లో నేటితో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో కోర్టులో దర్యాప్తు సంస్థలు హాజరుపరిచాయి. ఈ కేసు దర్యాప్తు పురోగతిని కోర్టుకు వివరించి కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఈడీ, సీబీఐ అధికారులు కోరారు. దీంతో ఈ నెల 20 వరకు కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. వారం రోజుల్లో కవితపై చార్జ్‌షీట్‌ను దాఖలు చేస్తామని కోర్టుకు ఈడీ అధికారులు వెల్లడించారు. ఆమె జ్యుడీషియల్ కస్టడీ అంశంపై జడ్జి కావేరి బవేజా విచారణ జరుపుతున్నారు. జైలులో కవిత చదవడానికి 10 పుస్తకాలు అనుమతించాలని కోర్టును ఆమె న్యాయవాది నితీష్ రానా కోరారు. కోర్టులో కవితను 15 నిమిషాల పాటు కలిసేందుకు కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోర్టును న్యాయవాది కోరారు. జైలులో కవితకు తన భర్త తెచ్చిన ఆహారం తినేందుకు అనుమతించాలని కోర్టును నితీష్ రాణా కోరారు. జైలులో కవితకు ఇచ్చే ఇంటి భోజనం 10-15 మంది పోలీసులు చెక్ చేసిన తర్వాత.. పాచిపోయిన ఆహారాన్ని ఆమెకు అందిస్తున్నారని.. అలా కాకుండా డాక్టర్, జైలు అధికారి పరిశీలించిన తర్వాత ఆహారాన్ని కవితకు అందించాలని కోర్టును కవిత న్యాయవాది కోరారు. ఆమె ఇంటి భోజనం వద్దన్న తర్వాత మళ్లీ ఎందుకు అడుగుతున్నారని జడ్జి న్యాయవాదిని ప్రశ్నించారు. కవితకు ఇంటి భోజనం అందించే అంశంపై జైలు సూపరింటెండెంట్‌ను వివరణ కోరతామని జడ్జి కావేరి బవేజా పేర్కొన్నారు.

**వాళ్లను దేశం దాటించారు: కవిత –** కాగా.. రౌస్ అవెన్యూ కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.. ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "ప్రజ్వల్ రేవన్న లాంటి వాళ్లను విడిచిపెట్టి, దేశం దాటించి నాలాంటి వాళ్లను అరెస్ట్ చేశారు. ఇది అన్యాయం, ఈ విషయాన్ని అందరూ గమనించాలి" అని కవిత పేర్కొన్నారు.

**ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించే యోచనలో కవిత..** అయితే.. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించే యోచనలో ఎమ్మెల్సీ కవిత ఉన్నట్లు సమాచారం. రేపు(బుధవారం) ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ట్రయల్ కోర్టు తీర్పును హైకోర్టులో కవిత సవాలు చేయనున్నట్లు తెలుస్తోంది.

# బీజేపీకి తెలంగాణ టీడీపీ మద్దతు..

హైదరాబాద్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని టీటీడీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా, టీటీడీపీ నేతలతో బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చర్చలు జరిపారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్, సీనియర్ నేతలు సాయిబాబా, కాట్రగడ్డ ప్రసూన, శ్రీపతి సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి భేషజాలు పెట్టుకోకుండా ప్రతీ టీడీపీ కార్యకర్త ఈసారి బీజేపీకి ఓటు వేసే విధంగా కృషి చేయాలని చింతల రామచంద్ర రెడ్డి కోరారు. మన ఓటు ఇతర పార్టీలకు వేస్తే ఉభయులకు నష్టం చేకూరుతుందని, ఏపీలో చంద్రబాబు సీఎం కావాలని ఆయన ఆకాంక్షించారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి టీడీపీ మద్దతు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ హైదరాబాద్‌కు రానున్నారని, ఆరోజు బహిరంగసభకు తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున రావాలని ఆయన కోరారు.

**కిషన్‌రెడ్డి గెలుపునకు టీడీపీ కృషి :** సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి గెలుపునకు టీడీపీ కృషి చేస్తుందని పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్‌కుమార్ గౌడ్ తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తెలంగాణలో బీజేపీతో టీడీపీ ఈ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులకు టీడీపీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సోమవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ నగర అధ్యక్షుడు పి. సాయిబాబా అధ్యక్షతన సమావేశం జరిగింది.

# ఓట్ల కోసం రీల్స్, వీడియోలు.. అభ్యర్థుల 'స్మార్ట్' ప్రచారం

హైదరాబాద్: ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు కలిసొచ్చే ప్రతి అంశాన్ని వాడుకుంటున్నారు. ఒకవైపు పాతపద్ధతిలో ఇంటింటి ప్రచారం చేస్తూనే మరోవైపు స్మార్ట్‌గా ఆలోచిస్తున్నారు. సోషల్ మీడియాతో 'స్మార్ట్'గా ప్రచారం చేస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. సరికొత్త సినిమా పాటలతో నేతల ప్రచార వీడియోలను 'షార్ట్స్'గా మార్చి వైరల్ చేస్తున్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్లకు అతుక్కునే యువత, మహిళలు, ఉద్యోగ, వ్యాపారులతో బిజీగా ఉండే వారిని ఇట్టే ఆకట్టుకుంటున్నారు.

మరోవైపు దీనికి ఖర్చు తక్కువ కావడంతో అభ్యర్థులు సైతం దీనిని నమ్ముకొంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా నిత్యం ఓటర్లకు అందుబాటులో ఉంటున్నారు. ఓ ప్రధాన పార్టీ దాదాపుగా 15 లక్షలకు పైగా వాట్సాప్ నెంబర్లను సేకరిస్తే మరో పార్టీ పదిలక్షలకు పైగా వాట్సాప్ నెంబర్లను సేకరించి సోషల్‌మీడియా ప్రచారంలోనూ తిరుగుతలేదనిపిస్తున్నాయి. వాటితో పాటు బ్రాడ్‌కాస్ట్ గ్రూపులకు ఒకేసారి మెసేజ్‌లను పంపించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యూట్యూబ్ షార్ట్స్, ఆకర్షించే వీడియోస్?తో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, వాట్సాప్ ఇలా ప్రతివేదికలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూప్‌లో రోజుకి పది రీల్స్ చొప్పున అభ్యర్థుల ప్రచారాన్ని వైరల్ చేస్తున్నారు. ప్రతి రీల్స్‌లో కొత్తదనం ఉండేలా.. ప్రసంగాల్లో ముఖ్యమైన అంశాలను ఆకర్షించేలా రీల్స్ చేసి జనం ఫోన్లలోకి వెళ్లేలా చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం కాదు.. ఇంట్లోని అందరి సెల్‌ఫోన్స్‌కు ప్రచారం రీచ్ అయ్యేలా చూస్తున్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660